# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 19-05-2016**

డిగ్రీ పట్టా చేతిలోకి వచ్చిన యువత ఖాళీగా ఉండకుండా తాము చదివిన విద్య ద్వారా స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందే దిశగా విద్యావ్యవస్థను తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు విద్యాశాఖ అధికారులకు సూచించారు. విద్యారంగంలో ఇప్పటిదాకా నడుస్తున్న మూస ధోరణులను వదిలి మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యలో అప్ టు డేట్ మార్క్ కన్పించేలా కోర్సులను ప్రవేశ పెట్టాలని సిఎం అన్నారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ తీరు తెన్నులపై క్యాంపు కార్యాలయంలో బుధవారం సిఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. డిగ్రీ కాలేజీల్లో ఆన్ లైన్ అడ్మిషన్లు, యూనివర్శిటీల్లో ఫ్యాకల్టీ, హాస్టళ్ల పరిస్థితి, ఇంజనీరింగు వృత్తి విద్యా కళాశాలల్లో చేపట్టిన విజిలెన్స్ తనిఖీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరితో పాటు ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తన ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని సిఎం పునరుద్ఘాటించారు. పూర్తిస్థాయి ప్రక్షాళన దిశగా తెలంగాణ ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఫలితాలనిస్తున్నాయని తెలిపిన ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో తాము చేపట్టిన బృహత్కార్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించిన కాలేజీ యాజమాన్యాలు వాటిని సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం తగినంత సమయమిస్తుందని అన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని పరిపుష్టం చేయాలంటే అనేక నూతన సంస్కరణలకు నాంది పలకాల్సిన అవసరం ఉన్నదన్నారు. అందుకు కాలేజీ యాజమాన్యాలు, విద్యాశాఖ సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ''గందరగోళంగా వున్న విద్యావ్యవస్థను చక్కదిద్దాలన్నదే మా ఉద్దేశ్యం. కెజీ టు పీజి వరకు ఉన్న విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి తద్వారా నాణ్యమైన విద్యను అందించాలనేదే మా లక్ష్యం. కొందరు దీనిని నెగెటివ్ గా భావిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదు'' అని సిఎం అన్నారు.

విద్యార్థి చదివిన విద్యకు, మార్కెట్ కు, పరిశ్రమకు అనుబంధంగా ఉండాలని తెలిపారు. ఆ దిశగా జూనియర్, డిగ్రీ, పీజీ తదితర వృత్తి విద్యాకోర్సులను రూపకల్పన చేయాలని తెలిపారు.

వివిధ పేర్లతో రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న ఉన్నత విద్యా సంస్థల యాజామాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చాయన్న సిఎం అటు ఎఐసిటిఈ తో గానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో గానీ సంబంధం లేకుండా కాలేజీలను నడుపుతుండడంపై ఆరా తీసారు. కనీస సౌకర్యాలు విస్మరించి నాసిరకం విద్యను అందిస్తున్న విద్యా సంస్థలు స్వచ్ఛందంగా తప్పుకోవడం మేలని అన్నారు. జవాబుదారీతనం లోపించిన విద్యా సంస్థలకు రాష్ట్రంలో చరమగీతం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. నఖిలీ ఫ్యాకల్టీని రికార్డుల్లో చూపెడుతూ అసలు విద్యార్దులే లేకుండా కాలేజీలను నడపడం దారుణమన్నారు. ''కొద్దో గొప్పో లోటు పాట్లు ఉన్నయంటే ఏమో గాని అసలు పంతుల్లు లేరు, పిల్లలు లేరు, ఏమీ ఉండవు, కాగితాల మీద కాలేజీ నడుస్తుంది ఎంత దారుణం.. ఇటువంటి ఫేక్ కాలేజీల యాజమాన్యాలను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని'' సింఎం హెచ్చరించారు. ”బాధ్యత గలిగిన ప్రభుత్వం అందరికీ న్యాయం జరుగాలని చూస్తుంది. మా ప్రభుత్వమూ అంతే...రిజర్వేషన్లు అమలు పరచకుండా తమ ఇష్టం వచ్చినట్టు అడ్మిషన్లు చేపడతాం అంటే ఎట్లా? వారు అటు కేంద్ర ప్రభుత్వానికో, ఇటు రాష్ట్ర ప్రభుత్వమో, లేక ప్రభుత్వం రంగ సంస్థచేత కనీసం నియంత్రణ లేకుండా నడిపించడం అస్సలు కరెక్టుకాదు” అని అన్నారు. కాలేజీల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనకబడ్డ విద్యార్ది చదువుకోవద్దా అని ప్రశ్నించారు.

యూనివర్సిటీల పరిస్థితేంది

---------------------------------

తెలంగాణ లో నడుస్తున్న యూనివర్శిటీలు, వాటిలో ఎన్ని వీసీ పోస్టులు ఖాళీగా వున్నాయి. వాటి అనుబంధ కళాశాలల పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని సిఎం ఆదేశించారు. యూనివర్శిటీ బిల్డింగుల పరిస్థితేంది? ఫ్యాకల్టీ పరిస్థితేంది? విద్యార్దుల పరిస్థితేంది? వాళ్ల హాస్టల్ల నిర్వహణ వ్యవహారమేంది? యే యే యునివర్శిటీకి ప్రభుత్వం యేమేరకు సహకారం అందించాలె? ఆర్థికంగా ఎన్ని పైసలు అవసరం? అనే అంశాల పై పూర్తిస్థాయి సమాచారాన్ని తనకు అందించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

'దోస్త్' ద్వారా అడ్మిషన్లు

-----------------------------

డిగ్రీ అడ్మిషన్లు ఇకనుంచి ఆన్ లైన్లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేసిన అనంతరమే ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను సిఎం ఆదేశించారు. బుధవారం నాటి సమీక్ష లో ప్రధాన అంశంగా ముందుకు వచ్చిన డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్, తెలంగాణ (డిఓఎస్టీ) - దోస్త్ - పై సీఎం చర్చించారు. ఆన్ లైన్ ద్వారా విద్యార్థులకు లభించే సౌలభ్యాన్ని సమీక్షించారు. ఆన్ లైన్ అడ్మిషన్ల ద్వారా విద్యార్థులకు కాలేజీల చుట్టు తిరిగి అడ్మిషన్ ఫీజులు చెల్లించే అనవసర ఖర్చు తప్పుతుందని, తమకు కావాల్సిన కాలేజీలో అడ్మిషన్ ను ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు వుంటుందని అధికారులు తెలిపారు. ఫీజు రీఇంబర్స్ మెంట్ కోసం కొన్ని కాలేజీ యాజమాన్యాల కక్కుర్తి చర్యలకు ఆన్ లైన్ అడ్మిషన్ విధానం అడ్డుకట్ట వేస్తుందని అనేక విధాలుగా ఇది శ్రేయష్కర విధానమని సిఎంకు అధికారులు వివరించారు. మెడికల్, ఇంజనీరింగు తదితర విద్యా కోర్సుల్లో నడుస్తున్న మాదిరిగానే డిగ్రీ కోర్సులకు ఆన్ లైన్ అడ్మిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. కాగా గ్రామీణ, జిల్లా స్థాయిల్లో వున్న డిగ్రీ కళాశాలలకు కనీస రుసుమును ప్రభుత్వం నిర్ధారించనున్నది. అయితే హైదరాబాద్ కేంద్రంగా ప్రతిష్టాత్మకంగా నడుస్తున్నడిగ్రీ కళాశాలలకు ఎంత మేరకు ఫీజును నిర్ధారించాలనే అంశం పై ఆయా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకోనున్నది. అటానమస్, మైనారిటీ, ప్రీమియర్ కాలేజీలను గుర్తించి వారితో చర్చించి పూర్తిస్థాయి కసరత్తు అనంతరం సానుకూల పద్దతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల ఆన్ లైన్ అడ్మిషన్ విధానం అమలులోకి రానున్నది.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, మిషన్ భగీరథ ఉపాధ్యక్షులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రంజీవ్ ఆచార్య, కాలేజీయేట్ కమీషనర్ వాణీ ప్రసాద్, జెఎన్టీయూ వీసీ శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**